క్లుప్తంగా

డీమార్ట్‌పై 6ఏ కేసు నమోదు



డీమార్ట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు(పొగతోట): నగరంలోని డీమార్ట్ స్టోర్‌లో విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు సంయుక్తంగా శనివారం తనిఖీలు నిర్వహించారు. కందిపప్పు నిల్వలు అనుమతికి మించి అధికంగా ఉండడాన్ని గుర్తించి 6ఏ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు, సీఎస్ డీటీ రాజశేఖర్ పాల్గొన్నారు.

రికార్డులు పకడ్బందీగా లేకుంటే రికవరీ



పొదలకూరు : ఉపాధి రికార్డులు పకడ్బందీగా లేకుంటే ఎఫ్ఏలు, టీఏల నుంచి నగదు రికవరీ చేస్తామని డ్వామా పీడీ, సోషల్ ఆడిట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ డీ వెంకటరావు హెచ్చరించారు. మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజావేదికను మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ పనులపై విచారణ జరిపిన పీడీ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.41,315 రికవరీకి ఆదేశించామని తెలిపారు. అందులో వెంటనే రూ.31,819 వసూలు చేశారు. మండలంలోని పంచాయతీలో జరిగిన పనుల్లో చిన్నపాటి పొరపాట్లు మాత్రమే ఉన్నాయన్నారు. సాంకేతిక సమస్యల కారణంగా కొందరు ఎఫ్ఏల నుంచి నగదు రికవరీ చేయాల్సి వచ్చిందని పీడీ వెల్లడించారు. పెద్దస్థాయిలో అవకతవకలు జరగలేదని, సోషల్ ఆడిట్లో ఫిర్యాదులు కూడా అందలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీహరిరెడ్డి, డీవీఓ సురేష్ బాబు, ఎస్టీఎం సత్యనారాయణ, ఎంపీడీఓ నగేష్ కుమారి, క్వాలిటీ కంట్రోల్ డీఈ వేణుగోపాల్, ఎస్ఆర్‌పీ మూర్తి, ఏపీఎం మధుసూదన్ పాల్గొన్నారు.

నమ్మబలికి రూ.3 లక్షలతో పరార్

• పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

వెంకటాచలం: ఇంటి పక్కనే నమ్మకంగా ఉన్న దంపతులు పోస్టల్ కార్యాలయంలో డిపాజిట్ చేస్తామని ఓ మహిళకు చెందిన రూ.3 లక్షల నగదు తీసుకు పరారయ్యారు. ఈ ఘటన వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీ నక్కలకాలనీలో శనివారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు ..నక్కల కాలనీకి చెందిన కోవూరు లీలమ్మ ఒంటరిగా నివసిస్తోంది. ఆమె ఇంటి పక్కనే కొన్నేళ్లుగా మనోజ్, ప్రణవి దంపతులు నివాసం ఉంటున్నారు. వారు లీలమ్మకు చేదోడువాదోడుగా ఉండేవారు. ఈ నేపథ్యంలో లీలమ్మ తన వద్దనున్న రూ.3 లక్షల ను నెల్లూరులోని పోస్టల్ కార్యాలయంలో డిపాజిట్ చేసేందుకు బాడుగ ఆటో మాట్లాడాలని శుక్రవారం మనోజ్, ప్రణవిని కోరారు. దీంతో వారు ఆరోగ్యం సరిగాలేనందున నువ్వు వెళ్లలేవని, మేమిద్దరం వెళ్లి నగదు డిపాజిట్ చేస్తామని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన లీలమ్మ తన వద్దనున్న రూ.3 లక్షలను వారికి ఇచ్చింది. డిపాజిట్ చేసి వస్తామని చెప్పిన దంపతుల కోసం లీలమ్మ రాత్రి వరకు ఎదురుచూసింది. శనివారం ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో మోసపోయానని తెలుసుకుని బోరున విలపిస్తూ వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోషకాహారం పంపిణీ

కొడవలూరు : మండలంలోని మానేగుంటపాడులో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు సొంతంగా తయారు చేసిన పోషకాహార పదార్థాలను ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా శిబిరానికి వచ్చిన పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తున్నందున పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు ప్రదర్శన, పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, దీనమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను వర్తింపజేయాలి

పొదలకూరు : జిల్లాలోని పరిశ్రమల్లో కార్మిక చట్టాలను వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు డిమాండ్ చేశారు. శనివారం పొదలకూరులో చేపట్టిన సీపీఎం పాదయాత్రలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సర్వేపల్లి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 13న నెల్లూరు నర్తకీ సెంటర్‌లో జరిగే బహిరంగ సభ వద్దకు తమ పాదయాత్ర చేరుకుంటుందన్నారు. పరిశ్రమల నుంచి వెదజల్లే కాలుష్యాన్ని నివారించాల్సిందిగా డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్, తిరుపాల్, ప్రసాద్, మండల ఇన్‌చార్జి కె.పెంచలయ్య పాల్గొన్నారు.

ఈవీఎంలు,వీవీప్యాట్స్ భద్రతకు చర్యలు

• కలెక్టర్ హరినారాయణ్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణ్

నెల్లూరు రూరల్: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ గోదాముల వద్ద తగిన భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ హరినారాయణ్ తెలిపారు. నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో శనివారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ మొదటి విడత తనిఖీలకు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఈవీఎంల తనిఖీ ప్రక్రియ ఆరంభమవుతుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి ఈవీఎంలు, వీవీప్యాట్‌లను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి భద్రపరుస్తామన్నారు. అనంతరం రెవెన్యూ, పోలీసు, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో గోదాముల వద్ద భద్రత కల్పిస్తామ న్నారు. ఈ సమావేశంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఈవీఎంల నోడల్ అధికారి సుధాకర్‌రావు, ఏఎస్పీ హిమవతి, ఆర్డీఓ మలోల, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస రెడ్డి, డీఎంహెచ్ఓ పెంచలయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, అర్బన్ తహసీల్దార్ నిర్మలానందబాబా పాల్గొన్నారు.

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సర్వేపల్లి అజయకుమార్

నెల్లూరు(బృందావనం): సుజాతమ్మకాలనీలోని శ్రీఅష్టలక్ష్మి మందిరంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీగణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞాన బోధ సభ ట్రస్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ సర్వేపల్లి అజయకుమార్ శనివారం తెలిపారు. అవధూత దత్తపీఠం–నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో శ్రీఅష్టలక్ష్మి మందిరం శ్రీకృష్ణయోగ మందిరం ప్రాంగణంలోని ఉమాదేవి సమేత నాగేశ్వరస్వామి ఆలయం, కార్యసిద్ధి ఆంజనేయస్వామి మందిరంలో ప్రతిరోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అమ్మవారికి విశేషపూజలు, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు వివిధ అర్చనలు, హోమాలు, కుమారి, సుహాసిని పూజలు, పల్లకిసేవ, మహాహారతి నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజూ అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులను కటాక్షించనున్నట్లు తెలిపారు. తొలుత శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ట్రస్టీ కొల్లం సురేష్, సుబ్రహ్మణ్యంరెడ్డి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య కిరీటి వెంకురెడ్డి సంస్మరణ సభ రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సురేంద్రనాథ్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ప్రముఖ కవి, సింహపురి సాహిత్య కిరీటి అగస్త్యరెడ్డి వెంకురెడ్డి సంస్మరణ సభను సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి కార్యదర్శి బీ సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు వర్ధమాన సమాజంలో శనివారం సంస్మరణ సభ ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ టౌన్‌హాల్ ట్రస్ట్, నెల్లూరు వర్ధమాన సమాజం, దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే సంస్మరణ సభకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ విశిష్ట అతిథిగా హాజరవుతారని తెలిపారు. కవులు, రచయితలు, సాహితీవేత్తలు, అగస్త్యరెడ్డి వెంకురెడ్డి అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. నెల్లూరు వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకరరెడ్డి, తెలుగుభాషోద్యమ నాయకులు చలంచర్ల భాస్కర రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యసేవలపై వైద్యురాలితో మాట్లాడుతున్న నెల్లూరు ఆర్డీఓ మలోల

నెల్లూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు ఆర్డీఓ మలోల కోరారు. నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆర్డీఓ సందర్శించారు. వైద్యసేవలు అందిస్తున్న తీరును పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. వైద్య శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. దేవరపాళెం పంచాయతీ పరిధిలోని ప్రజలు అధిక సంఖ్యలో శిబిరానికి తరలి వచ్చారు. వైద్యులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. రూరల్ ఎంపీపీ విజయకుమార్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్ర కుమార్, వైద్యులు నాయక్, కవిత పలువురు వైద్యసిబ్బంది, మండలాధికారులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదుపు రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

నెల్లూరు(బారకాసు): బ్యాంక్ లింకేజీ రుణాలను పొదుపు సంఘాలు సక్రమంగా చెల్లించేలా చూడాలని మెప్మా పీడీ రవీంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మెప్మా కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మెప్మా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణ సమైఖ్యల ఆర్పీల పనితీరును మెరుగు పరుచుకోవాలని సూచించారు. టీఎల్ఎఫ్ ఆర్పీల పని విధానంపై పీడీ అసహనం వ్యక్తం చేశారు. ఎస్ఎల్ఎఫ్‌తో పట్టణ సమైఖ్యల్లో ఏమైనా పొరపాట్లు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి సమైఖ్య సమావేశానికి హాజరై సంఘాలు సక్రమంగా నడిచే విధంగా చూడాలన్నారు. ప్రతి సంఘం సమావేశాన్ని నిర్వహించుకునేలా ఆయా సంఘాల లీడర్లకు సూచనలు సలహాలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఐబీ అంకయ్య, పీఎల్ఎఫ్ ఆర్పీలు గీత,ధనలక్ష్మి, సౌందర్య, రజిని, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్



మాట్లాతున్న లక్ష్మీ సునంద

నెల్లూరు సిటీ: జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని కేన్సర్ విభాగంలో బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు జీజీహెచ్ అభివృద్ధికి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద పేర్కొన్నారు. శనివారం ఆమె జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అక్టోబర్ నెలను రొమ్ము కేన్సర్ అవగాహన మాసంగా పరిగణించి జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్ సహకారంతో వైద్యులు పద్మావతి, ఇంద్రజ, హరిప్రియ పర్యవేక్షణలో స్క్రీనింగ్ సేవలను అందిస్తున్నామని తెలిపారు. వైద్యపరీక్షల్లో కేన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తిస్తే ఎఫ్ఎన్ఏసీ బయాప్సి ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తామన్నారు. కేన్సర్ నిర్ధారణ అయిన రోగికి తగిన వైద్య సేవలను అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని 40 ఏళ్లు పైబడిన స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలల సమగ్ర సంరక్షణ పథకంపై సమీక్ష



సిబ్బందితో సమీక్షిస్తున్న పీడీ హేనాసుజన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఐసీడీఎస్ పీడీ హెనాసుజన్ ఆధ్వర్యంలో బాలల సమగ్ర సంరక్షణ పథకంపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిర్వహించిన ఈ సమావేశంలో బాలల సమగ్ర సంరక్షణ పథకం స్పాన్సర్లకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ సమావేశంలో బాలల సమగ్ర సంరక్షణ డీసీపీఓ సురేష్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు భారీగా అపరాధ రుసుం

నెల్లూరు(క్రైమ్)/నెల్లూరు(లీగల్): నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన తొమ్మిది మంది మందుబాబులకు రెండో అదనపు మొదటి తరగతి మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎల్ శారదారెడ్డి శనివారం భారీగా అపరాధ రుసుం విధించారు. మద్యం మత్తులో ఘర్షణలు, రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్నీ పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వందల సంఖ్యలో కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనచోదకులకు కోర్టు రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు అపరాధ రుసుం విధించే వారు. అధికంగా మద్యం సేవించి ఉంటే పర్సంటేజీను బట్టి జైలు శిక్ష విధించే వారు. అయినా వాహనచోదకుల్లో మార్పు రాకపోవడంతో అపరాధ రుసుంను రూ.10వేలకు పెంచారు. తాజాగా చిన్నబజారు పోలీస్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 9 మందికి న్యాయమూర్తి శనివారం రూ.10వేలు చొప్పున అపరాధ రుసుం విధించారు. తాజాగా అపరాధ రుసుం విధించిన వారిలో సాయిశ్రీనివాసులు, విజయభాస్కర్, చలపతి, సమీరుల్లా, వేణుగోపాల్, ముక్తియార్, హనీఫ్, భగవత్‌సింగ్, రాయక్ ఉన్నారు.

'అల్లూరి' సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమాదేవి

నెల్లూరు(బృందావనం): జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘ కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా నెల్లూరుకు చెందిన పీ రమాదేవి ఎన్నికయ్యారు. ఈ నెల 2న గాంధీ జయంతి నాడు అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలో జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు శనివారం తెలిపారు. గతేడాది అల్లూరి సీతారామరాజు స్మారకంగా పోస్టల్‌శాఖ విడుదల చేసిన ఎనిమిది ప్రత్యేక పోస్టల్ కవర్ల విడుదల్లో రమాదేవి కీలకపాత్ర పోషించారన్నారు. తెలంగాణ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సంఘ శాఖల ఏర్పాటుకు ఎంతో దోహద పడ్డారని పేర్కొన్నారు.

రేపు జిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉమ్మడి నెల్లూరు జిల్లా సీనియర్ స్త్రీ, పురుషుల ఫెన్సింగ్ జట్ల ఎంపికలను నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీ వేణుగోపాల్‌రెడ్డి, జీ గురవయ్య శనివారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సాయంత్రం 3 గంటలకు ప్రారంభమయ్యే ఎంపికలకు 13 ఏళ్లు నిండిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 919866 046081 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మర్యాదపూర్వకంగా..



ఈఈ మురళీకృష్ణకు సత్కారం

నెల్లూరు(బారకాసు): నగరంలోని ఆర్అండ్‌బీ నెల్లూరు డివిజన్ కార్యాలయంలో ఈఈ మురళీకృష్ణను ఏపీఆర్అండ్‌బీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈఈకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటసురేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ మధు, కోశాధికారి రాజానవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడు జకీరుద్దీన్‌తో పాటు ప్రభాకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● వైభవంగా బంగారు గరుడసేవ



నెల్లూరు రూరల్ పరిధిలో నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి బంగారు గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. తొలుత లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దేవదేవేరులను విశేషంగా అలంకరించి బంగారు గరుడ వాహనంపై కొలువుదీర్చి గిరిప్రదక్షణ జరిపారు. ఉభయకర్తలుగా నెల్లూరుకు చెందిన శ్రీనివాసరావు, అమృతవల్లీ దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

–నెల్లూరు రూరల్

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న రంగారెడ్డి

నెల్లూరు రూరల్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి బాటలు వేయాలని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. రూరల్ నియోజకవర్గంలోని 21వ డివిజన్‌లో నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎనలేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రేబాలవారివీధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆత్మకూరుకు చెందిన రిజ్వానా(35)కు అక్బర్‌బాషాతో 2007లో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు సంతానం. మనస్పర్థల నేపథ్యంలో వివాహమైన రెండేళ్లకే దంపతులు విడిపోయారు. అప్పట్నుంచి రిజ్వానా జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో ఉంటూ తన ఇద్దరు పిల్లలను పోషించుకోసాగింది. ఈ క్రమంలో ఆమెకు స్టోన్‌హౌస్‌పేటకు చెందిన పూర్ణతో పరిచయం ఏర్పడింది. ఇద్దరు సన్నిహితంగా ఉంటున్నారు. మూడు నెలల కిందట ఆమె జాకీర్‌హుస్సేన్‌నగర్ నుంచి రేబాలవారి వీధికి వచ్చింది. ఏమైందో ఏమో తెలియదుకాని నెలరోజుల నుంచి ఆమెను పూర్ణ పట్టించుకోవడం మానేశాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 6న రాత్రి ఆమె తన పిల్లలతో కలిసి భోజనం చేసింది. అనంతరం పడకగదిలోకి వెళ్లి నిద్రపోయింది. పిల్లలు మరోగదిలో నిద్రపోయారు. శనివారం ఉదయం పిల్లలు నిద్ర నుంచి లేచి పడకగది తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా రాలేదు. తల్లిని పిలిచినా లోపల నుంచి ఎలాంటి అలికిడి లేకపోవడంతో బయటకొచ్చి స్థానికులకు విషయాన్ని తెలియజేశారు. వారు తలుపులు పగులగొట్టి చూడగా రిజ్వానా పడకగదిలోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు ఆమె కుటుంబసభ్యులు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎం బాబి తెలిపారు.

విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారం



విద్యుత్ సర్వీసులను తనిఖీ చేస్తున్న ఏఈ విజయ్‌కుమార్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుపై కిసాన్‌నగర్ సెక్షన్ ఏఈ విజయ్‌కుమార్ తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించారు. నగరంలోని భగత్‌సింగ్‌కాలనీలో నివాసం ఉంటున్న రామకృష్ణ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా లోఓల్టేజీ, మీటర్ రీడింగ్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. శనివారం రామకృష్ణ ఇంటిని ఏఈ సందర్శించి సమస్యలను పరిష్కరించారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీ

భగత్‌సింగ్ కాలనీలోని విద్యుత్ సర్వీసులను ఏఈ విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి శనివారం తనిఖీ చేశారు. అనుమతి కన్నా అధికంగా విద్యుత్‌ను విని యోగిస్తున్న సర్వీసులను గుర్తించి అడిషనల్ లోడ్ కింద నమోదు చేశారు. లైన్‌ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, సిబ్బంది సుధాకర్, మనోహర్, నరసింహులు, కుమార్ పాల్గొన్నారు.

విశ్రాంత సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న నారాయణస్వామి

నెల్లూరు(బృందావనం): జిల్లాలోని పారా మిలిటరీ విశ్రాంత సైనికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు నారాయణస్వామి పేర్కొన్నారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో శనివారం నిర్వహించి సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 23న ఢిల్లీలో జరిగిన జాతీయ సమావేశానికి సంబంధించిన వివరాలను నారాయణస్వామి వెల్లడించారు. విశ్రాంత పారామిలిటరీ ఆఫీస్ కోసం నెల్లూరురూరల్ తహసీల్దార్‌ను కలిసి విన్నవించామన్నారు. పారామిలిటరీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. జిల్లాలో పారామిలిటరీ సిబ్బంది ఎవరైనా ఉంటే సంఘ జిల్లా సెక్రటరీ ఏ పాల్‌ను 75697 84894, 94902 30271 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో విశ్రాంత కమాండెంట్ వీవీ కృష్ణయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీరోడ్డు నిర్మాణ పనులు



నగరంలోని చిన్నబజారులో సీసీరోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యాపార సముదాయాలకు నెలవైన చిన్నబజార్ మెయిన్ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. మెయిన్ రోడ్డు గుంతలతో నిండడంతో వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం నూతనంగా సీసీరోడ్డు నిర్మాణం చేపడుతోంది. –సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇరుకాళమ్మ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రాజావారి విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. రాజావారివీధి, చాముండివారితోట, పల్లెమిట్ట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు.